క్లుప్తంగా

27న అరుణాచల గిరి ప్రదర్శనకు ఆర్టీసీ బస్సు

గుడివాడటౌన్: ప్రతి నెలా పౌర్ణమి రోజు అరుణాచల క్షేత్ర గిరి ప్రదర్శనకు భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తుందని గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ డి.రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న మధ్యాహ్నం 2.30 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు గుడివాడలో బయలుదేరి 28న కాణిపాకం, శ్రీపురం దేవాలయాలను దర్శించుకుని అరుణాచలం చేరుకుంటుంది. 29వ తేదీ గిరి ప్రదర్శన అనంతరం బస్సు బయలుదేరి శ్రీకాళహస్తి దర్శనం చేసుకుని 30వ తేదీ ఉదయానికి గుడివాడకు చేరుకుంటుందన్నారు. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 73829 03299ను సంప్రదించాలని కోరారు.

స్పందనకు 5 దరఖాస్తులు



గుడివాడటౌన్: గుడివాడ ఆర్డీఓ కార్యాలయం, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమాలకు మొత్తం ఐదు దరఖాస్తులు వచ్చాయి. కుల ధ్రువీకరణ పత్రాల నిర్ధారణలో అవకతవకలపై విచారణ జరపాలంటూ స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అడుసుమిల్లి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఆర్డీఓ పి.పద్మావతికి అర్జీ సమర్పించారు. సాంకేతిక కారణాల వలన తమకు కేటాయించిన టిడ్కో ఫ్లాట్‌లు తమకు అందలేదని నలుగురు టిడ్కో లబ్ధిదారులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఏర్పాటు చేసిన ఏ పథకం అయినా వారికి చేరేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

విద్యుత్ మీటర్ల ఆకస్మిక తనిఖీ

తోట్లవల్లూరు: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాన్స్‌కో విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు, సిబ్బంది 30 బృందాలుగా ఏర్పడి సోమవారం ఆకస్మిక తనిఖీ జరిపారు. 2350 ఇంటి సర్వీసులు, 58 వాణిజ్య, 5 ఆక్వా సర్వీసులను తనిఖీ చేసినట్లు వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ తనిఖీలలో 262 సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి, రూ.8.28 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీలలో ఉయ్యూరు ఈఈ కృష్ణానాయక్, డీఈఈ ఎంవీవీ రామకృష్ణ, ఏఈఈ దేవదాస్, సిబ్బంది ప్రసాద్, వాణి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

లోకుమూడి దత్తాశ్రమంలో 15 నుంచి దసరా ఉత్సవాలు

మండవల్లి: మండలంలోని లోకుమూడి దత్తాశ్రమంలో దసరా మహోత్సవాన్ని కోటి కుంకుమార్చనతో ఈ నెల 15 నుంచి 24 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు దత్తాశ్రమ కార్యనిర్వహణాధికారి గురజాడ ఉదయ్‌శంకర్ తెలిపారు. దత్తాశ్రమంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మైసూర్ దత్త పీఠ గణాపాటి ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో రుత్వికుల బృందం ఉత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్ నియంత్రణ

- చట్టాలతో పూర్తిస్థాయిలో కట్టడి అసాధ్యం
- వర్తకులు, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం
- కఠిన చర్యలతోనే కొంతవరకు అదుపు
- టోకు వ్యాపారుల వద్దే నియంత్రించాలి



గుడివాడ పట్టణ నడిబొడ్డున చింతల కాల్వలో పేరుకుపోయిన క్యారీబ్యాగులు, ఇతర వ్యర్థాలు

గుడివాడటౌన్: వాతావరణ కాలుష్యానికి ప్రధాన కారణాలలో ఒకటి తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లు(క్యారీబాగ్‌లు). ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా ప్రజల సహకారం లేనిదే వీటి నియంత్రణ సాధ్యం కాదని అనేకసార్లు రుజువైంది. గుడివాడ పట్టణంలో 36 వార్డులలో చెత్త సేకరణకు ప్రభుత్వం 30 కొత్త వాహనాలను ఏర్పాటు చేసింది. వాటిని నడపడానికి ఒక్కొక్కదానికి నెలకు రూ.15 వేలు ఖర్చు అవుతుంది. సగటున నెలకు రూ. 4.50 లక్షలు చెత్త సేకరణకు ఖర్చు చేయడంతో పాటు 289 మంది పర్మినెంట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు డ్రెయిన్‌లు బాగుచేయడం, చెత్త సేకరించే పని చేస్తున్నారు. వారికి నెలకు కనీసంగా రూ.90 లక్షలు జీతాల రూపంలో పురపాలక సంఘం చెల్లిస్తోంది. ఇంత ఖర్చు చేసినా ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లలో వ్యర్థాలు మూటగట్టి మురుగు కాల్వలలో పారవేయడం కొనసాగుతూనే ఉంది. దీంతో పెద్దఎత్తున మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడటం, దోమలు విపరీతంగా పెరిగిపోవడం, పరిసర ప్రాంత ప్రజలకు దుర్గంధం వెదజల్లడం పరిపాటిగా మారింది. నెలకు రెండు పర్యాయాలు మున్సిపల్ సిబ్బంది, అధికారులు షాపులపై దాడులు చేసి ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు అమ్ముతున్న వారిపై జరిమానాలు విధించడం, పట్టుబడిన క్యారీ బ్యాగులు దగ్ధం చేస్తున్నప్పటికీ వాడకంలో ఏమాత్రం మార్పు కన్పించడం లేదు. ఇది పూర్తిగా మారాలంటే ప్రజల్లో చైతన్యం, నిషేధంపై చిత్తశుద్ధి, పర్యావరణ పరిరక్షణపై ఆసక్తి ప్రజల్లో పెంపొందినప్పుడే ఇది సాధ్యం అవుతుందని నిపుణులు అంటున్నారు. ఆ దిశగా ప్రజలు ఆలోచించాలని అభిప్రాయపడుతున్నారు.

చర్యలు కఠినతరం చేయాలి



ప్రభుత్వ ఆదేశాలు ప్రజలు అనుసరించాలంటే అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిందే. వలంటీర్ల ద్వారా ప్లాస్టిక్ నియంత్రణ చేయడానికి ప్రయత్నించాలి. వారి ద్వారా స్థానికులకు విజ్ఞప్తి లేదా హెచ్చరికలు చేయించాలి. ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు వాడుతున్న వారిపై కూడా జరిమానాలు విధించేలా అధికారులు ముందుకు రావాలి. అప్పుడే ప్రజల్లో మార్పు వస్తుంది. ఆ దిశగా కొంతైనా కఠినంగా వ్యవహరించకపోతే ప్లాస్టిక్ నియంత్రించడం కష్టం.

– చందూరి శేఖర్, స్థానికుడు

అన్ని చర్యలు తీసుకుంటున్నాం



ప్రజలను చైతన్యపర్చేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను మైక్‌ల ద్వారా ప్రజలకు వివరిస్తున్నాం. క్యారీబ్యాగ్‌ల అమ్మకాలపై దాడులు నిర్వహిస్తున్నాం. వర్తకుల సహకారం అంతంత మాత్రంగానే ఉంది. టోకు వ్యాపారులను గుర్తించే చర్యలు చేపట్టాం. దాడులు చేస్తాం. చట్టపరమైన కఠిన చర్యలతో పాటు పెద్దమొత్తంలో జరిమానాలు విధించేందుకు రంగం సిద్ధం చేశాం. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– వి.మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం

ఆర్డీఓ పి.పద్మావతి



ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ పి.పద్మావతి

గుడివాడరూరల్: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. మండల పరిధిలోని మల్లాయపాలెం సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని అధికారులతో కలసి ఆమె ప్రారంభించారు. తొలుత అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ప్రజలకు వైద్యులు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో 7 రకాల వైద్య పరీక్షలు చేసి 118 రకాల మందులను అందజేస్తారన్నారు. పేద ప్రజలకు గ్రామస్థాయిలోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 400 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, పలువురు వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీవైఈఓ కార్యాలయానికి గదులు కేటాయించండి



మున్సిపల్ కమిషనర్‌కు సమస్య వివరిస్తున్న డీవైఈఓ పద్మరాణి

గుడివాడటౌన్: డెప్యూటీ ఎడ్యుకేషనల్ కార్యాలయానికి గదులు కేటాయించాలని డీవైఈఓ ఐ.పద్మరాణి మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణను కోరారు. సోమవారం ఆయనను కార్యాలయంలో కలిసి విషయాన్ని వివరించారు. గతంలో స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్‌లోని ఖాళీ గదుల్లో కార్యాలయం నిర్వహించామని, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం దానిని ఖాళీచేసి ప్రస్తుతం అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి అద్దె రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని పాత మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగం ఖాళీగా ఉన్నందున దానిలో కార్యాలయ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఆమె కోరారు. ఈ విషయాన్ని ఆర్డీఓ పి.పద్మావతి దృష్టికి సైతం తీసుకువెళ్లామన్నారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ రాతపూర్వక అభ్యర్థనను ప్రత్యేక అధికారి, జాయింట్ కలెక్టర్‌కు పంపితే వారి అనుమతితో కార్యాలయం ఏర్పాటుకు సహకరిస్తామని చెప్పారు.

నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న సీహెచ్ రామకృష్ణ

గుడివాడటౌన్: సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులు వాటి అనుబంధ సంస్థలపై నైపుణ్యాన్ని పెంపొందించుకోడానికి కృషి చేయాలని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి సీహెచ్ రామకృష్ణ అన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ పరిశ్రమలో క్లౌడ్ కంప్యూటింగ్ నిపుణుల అవసరం ఎంతో ఉందన్నారు. విద్యార్థులు వీటిని నేర్చుకోవడం వలన ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రెండు వారాలు జరిగే ఈ శిక్షణను విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి జీ.వెంకటరత్నం, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ముదినేపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ప్రజలకు మంచి ఆరోగ్యం చేకూరుతుందని తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపీడీఓ పి.మల్లీశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయశాలను అధికారులు సోమవారం ప్రారంభించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచక్షణారహితంగా వినియోగిస్తున్నందున వ్యవసాయ ఉత్పత్తులు విషపూరితంగా మారుతున్నాయన్నారు. వీటిని ఆహారంగా తీసుకుంటున్న ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని వివరించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఎలాంటి దుష్పరిణామాలు లేకుండా ఆరోగ్యంగా జీవించవచ్చని అన్నారు. నియోజకవర్గ డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్, మండల ఇన్‌చార్జి నారాయణ, ఐసీఆర్పీలు అనూష, సుధాకర్, డ్వాక్రా సీసీలు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగులకు సత్కారం



తపాలా అధికారులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

గుడివాడటౌన్: ప్రపంచ తపాలా దినోత్సవాలను పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పోస్టల్ అధికారులు హెడ్ పోస్ట్‌మాస్టర్ ఫణికుమార్, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసరావు, పోస్ట్ ఉమన్ నళినిలను సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ సుదూర ప్రాంతాల సమాచారాన్ని స్నేహితులకు, బంధువులకు, అధికారులకు చేరవేయడంలో పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. వీరి విశేష సేవలను గుర్తించి చిరు సత్కారాన్ని అందజేశామని క్లబ్ నిర్వాహకులు అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, కోశాధికారి చింతా రామకృష్ణ, సభ్యులు బొగ్గరపు తిరుపతయ్య, ఎల్ఈ వెంకటేశ్వరరావు, ఎం.రామకృష్ణ, జె.వెంకటేశ్వరరావు, కె.రామారావు, ఆర్‌డీ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమంతో సమాజం సుభిక్షం



సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ జిల్లా గవర్నర్ శంకర్‌గుప్తా

పామర్రు: మహిళలు సంక్షేమంగా ఉంటే ఇటు కుటుంబం అటు సమాజం సుభిక్షంగా ఉంటుందని లయన్స్ జిల్లా 316డి గవర్నర్ ఎన్.శంకర్‌గుప్తా అన్నారు. పామర్రు లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ తరగతుల రెండవ బ్యాచ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థిక పురోభివృద్ధే లక్ష్యంగా లయన్స్ క్లబ్ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ శిబిరంలో 100 రోజుల కాల పరిమితిలో కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి ధ్రువపత్రంతో పాటు బ్యాంకు రుణాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కూనపరెడ్డి చంద్రశేఖర్‌రావు, పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, రీజియన్ చైర్మన్ పి.విజయ్‌బాబు, కార్యదర్శి ఎం.మధుసూదనరావు, డైరెక్టర్ పెరుమాళ్ల రాధాకృష్ణ, టైలర్ ప్రతినిధి డి.డి.ప్రసాద్, కుట్టు శిక్షణ ఉపాధ్యాయిని సుగ్గున జ్యోతి, మహిళలు పాల్గొన్నారు.

12న హుండీ కానుకల ఆదాయం లెక్కింపు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధిచెందిన సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని ఈనెల 12న లెక్కిస్తామని ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగే ఈ లెక్కింపులో వివిధ ఆలయాల మేనేజర్లు, సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ప్రముఖులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

అనధికార లేఅవుట్‌లపై సీఆర్‌డీఏ కొరడా



పామర్రు: ఏ విధమైన అనుమతులు లేకుండా అనధికారికంగా ఏర్పాటుచేసిన లేఅవుట్‌లను తొలగించామని ఏపీ సీఆర్‌డీఏ జోనల్ డెప్యూటీ డైరెక్టర్ కె.వి జయలత తెలిపారు. పామర్రు, పరిసర గ్రామాలలో ఉన్న అనధికార లే అవుట్‌లను సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వ్యవసాయ భూములను ప్లాట్లుగా విడగొట్టి రోడ్లను నిర్మించి అమాయక ప్రజలకు విక్రయించడం వలన ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని అన్నారు.ఈ నేపథ్యంలో అనుమతులు లేకుండా అక్రమంగా వేసిన లే అవుట్ రోడ్లను, సర్వేసు రాళ్లను తొలగించామని అన్నారు. సర్వే నంబర్లు 177(పీ), 628(పీ), 629(పీ)పామర్రు గ్రామం, పెదమద్దాలి గ్రామంలోని సర్వే నంబరు 164(పీ)లో వేసిన రోడ్లను పొక్లయినర్ సహాయంతో తొలగించామని చెప్పారు. అనధికార లే అవుట్లలో ప్లాట్ల విక్రయం చట్టరీత్యా నేరం అని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనధికార లే అవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు నష్టపోతారని, చట్టప్రకారం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. అనధికార లే అవుట్ గాని, అనధికార కట్టడాలు కాని గుర్తించిన వారు 70955 99838 నంబరుకు మెసేజ్ చేయాలని, లేదా 0866-2527154 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ అధికారులు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వాణి, పామర్రు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, స్థానిక సచివాలయ ఉద్యోగి రవి పాల్గొన్నారు.

ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణే ధ్యేయం



పాములలంకలో వృద్ధురాలికి మందులు అందజేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ రమేష్



అయ్యంకిలో వైద్యం కోసం బారులు తీరిన ప్రజలు



కలిదిండి మండలం మట్టగుంట జగనన్న సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఎలకుర్రు (పామర్రు): ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మకూరు పీహెచ్‌సీ పరిధిలోని ఎలకుర్రు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, పల్లికొండ రత్నకుమారి, మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ పానే శివ మస్తాన్‌రావు, ఎంపీడీవో వై.రామకృష్ణ, నిమ్మకూరు వైద్యులు అమీర్, రఘురామ్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

కైకలూరు: ఇంటి వద్దకే వైద్య సేవలు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండలం మట్టగుంట గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆరోగ్య సురక్ష కౌంటర్‌లను పరిశీలించారు. జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి సత్యవతి, వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్ పాల్గొన్నారు.

కొవ్వాడలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష

మండవల్లి: మండవల్లి మండలం కొవ్వాడలంకలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటుచేశారు. వివిధ వ్యాధులకు వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఎంపీడీఓ సీకే వెంకటరమణ, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, సర్పంచ్ జయమంగళ లక్ష్మి, ఎంపీటీసీ జయమంగళ తిరుపతి వెంకన్న, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాములలంకలో...

తోట్లవల్లూరు: మండలంలోని పాములలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం జరిగింది. తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న ఆధ్వర్యంలో వైద్యబృందం 456 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేసింది. శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి, ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ డి.విజయలక్ష్మి సందర్శించి పరిశీలించారు. వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ శీలం రమేష్, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ కుసుమకుమారి, సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.


అయ్యంకిలో...

అయ్యంకి(మొవ్వ): మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని గ్రామ ఉపసర్పంచ్ రాజులపాటి సుబ్బారావు లాంఛనంగా ప్రారంభించగా వైద్య నిపుణులు ఎ.నిహారిక, సీహెచ్ నిహారిక, ఎ.ఫణిశంకర్, ఎ.సాయికిరణ్, ఆప్తాలమిస్ట్ అనూష మొత్తం 683 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ నాగనబోయిన సునీల్, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ పర్యవేక్షించారు.

సింగరాయపాలెంలో ఆరోగ్య సురక్ష

ముదినేపల్లిరూరల్: ప్రతి ఒక్కరు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, తహసీల్దార్ కె.శ్రీనివాస్ అన్నారు.సింగరాయపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ప్రజలకు స్వల్ప, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి ఉచితంగా వైద్యం అందించడంతో పాటు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, బోయిన రామరాజు, కోమటి విష్ణువర్ధన్, రాచూరి కుమార్, దివి సతీష్, ముదినేపల్లి, గురజ, దేవపూడి పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోటీలకు అసిస్సీ విద్యార్థుల ఎంపిక



పామర్రు: త్వరలో జరగబోయే జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పామర్రు అసిస్సీ విద్యార్థులు ఎంపిక అయ్యారని అసిస్సీ హెచ్‌ఎం వలసా సెబాస్టియన్ తెలిపారు. స్థానిక అసిస్సీ హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను సోమవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెనమకూరులో జరిగిన పోటీలలో తమ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని అన్నారు. జూనియర్స్ షార్ట్‌పుట్ విభాగంలో కె.ఆయుష్కా పాప, కె లక్ష్మి ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారని అన్నారు. లాంగ్ జంప్‌లో లిఖిత్‌సాయి తృతీయ స్థానం, డిస్కస్ త్రో జూనియర్స్ విభాగంలో నాగ క్షీరజ ప్రథమ స్థానం సాధించారన్నారు. జూనియర్స్ లాంగ్‌జంప్‌లో జె.షర్మిల తృతీయ స్థానంలో గెలుపొందారని తెలిపారు. సీనియర్స్ విభాగంలో ట్రిబుల్ జంప్‌లో శాయి రూపేష్, డి.దయాకర్ ప్రథమ, ద్వితీయ స్థానాలను, లాంగ్ జంప్‌లో వి.కరుణకుమార్ ప్రథమ స్థానం, వాకింగ్‌లో గౌరీశంకర్ తృతీయ స్థానం పొందారన్నారు. విజేతలైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ ఎం.గ్లాడిసన్‌ను హెచ్‌ఎం సెబాస్టియన్, పాఠశాల కరస్పాండెంట్ మేరీ జోసఫ్ అభినందించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



పద్మ(ఫైల్)

గుడివాడరూరల్: పట్టణంలోని పెద ఎరుకపాడుకు చెందిన ఓ వివాహిత అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ బి.తులసీధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పెదఎరుకపాడుకు చెందిన గడ్డం వేణు భార్య పద్మ(50) ఈనెల 2వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమైంది. ఈ క్రమంలో భర్త వేణు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా పద్మ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పద్మ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. పద్మ ఆచూకీ తెలిసిన వారు సెల్: 83329 83797(సీఐ), 94407 96424(ఎస్ఐ), 08674-242153లకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

సొసైటీ అధ్యక్ష పదవికి తుమ్మల రాజీనామా

పెదపారుపూడి: మండల కేంద్రమైన పెదపారుపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుమ్మల కోటేశ్వరరావు తన పదవికి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ చైర్‌పర్సన్ పదవిలో 25 నెలల కాలం ఉన్నానని, మరొకరికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో తన పదవికి రాజీనామా చేశానని వివరించారు. తన హయాంలో రైతునేస్తం, క్రాప్, ఎల్‌టీ లోన్లు సుమారు రూ.7.25 కోట్లు ఇచ్చామన్నారు. తన రాజీనామా పత్రాన్ని డివిజన్ కోఆపరేటివ్ ఆఫీసర్ (డీఆర్) విజయలక్ష్మికి పంపుతున్నట్లు తెలిపారు.

11న భవనం తొలగింపునకు వేలంపాట

ముదినేపల్లి రూరల్ : మండలంలోని అల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో శిథిలావస్థకు చేరిన మొదటి అంతస్తు భవనం తొలగింపునకు 11న బహిరంగ వేలంపాట నిర్వహిస్తామని ఎంపీడీఓ పి.మల్లీశ్వరి సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్న పాటదారులు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.